రాజ్యాధికారం కోసం బహుజనులు ఐక్యం కావాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న, జూలూరు గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: దేశంలో బహుజన చైతన్యం అవసరం ఎంతగానో ఉందని శాసన మండలి సభ్యుడు గోరెటి వెంకన్న అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో రచయిత వనపట్ల సుబ్బయ్య రచించిన 'ధిక్కార' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లలో కులాల లెక్కలు తేలనిదే పంచాయితీలకు తెరపడదన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిందేనని నొక్కి చెప్పారు. సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు జూలురు గౌరీశంకర్ మాట్లాడుతూ..బహుజనులు రాజ్యాధికారం కోసం ఐక్యం కావాలన్నారు. బహుజనుల కోసం ధిక్కారపు స్వరంతో ఉద్యమించాలని సంఘటితంగా సమైక్యమై ఒకే వేదికపైకి వచ్చి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఐక్యంగా పోరాడితేనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య విమర్శకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పసునూరి రవీందర్, రచయిత్రి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జియాగూడలో బీజేపీకి ఆదరణ


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ, శివకుమార్ యాదవ్ తదితరులు

జియాగూడ: జియాగూడలో బీజేపీ ఎంతో ప్రణాళికలతో ఓటు బ్యాంకును ఉంచుకుంటుందని ఇందుకు నిదర్శనం ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అత్యధికంగా ఓట్లు సాధించిందని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, గోల్కొండ జిల్లా డెయిరీ సెల్ కన్వీనర్ శివకుమార్ యాదవ్ అన్నారు. శనివారం లక్ష్మీనర్సింహానగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కార్వాన్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసిన దివంగత బద్దం బాల్‌రెడ్డి హయాం నుంచే జియాగూడలో పార్టీకి మంచి పట్టు లభిస్తూ వచ్చిందని ముఖ్యంగా బీజేపీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లను గెలిపించడంతో పాటు కార్వాన్ అసెంబ్లీ లోక్‌సభ ఎన్నికలకు సైతం ఓటు బ్యాంకును అందిస్తూ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు రేపాక సంతోష్, డివిజన్ కార్యదర్శి భాస్కర్‌గుప్తా, బీజేవైఎం అధ్యక్షుడు రాజ్‌పోల్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

అమర్‌నాథ్ యాత్రికులకు అందుబాటులో ప్రత్యేక దుస్తులు


వివిధ మోడళ్లలో ఉలెన్, నైలాన్ దుస్తులతో పాటు రెయిన్ కోట్‌లను ప్రదర్శిస్తున్న ఇలియాస్ బుకారీ

చార్మినార్: జమ్మూ, కశ్మీర్–అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం చలితో పాటు వర్షాన్ని సైతం తట్టుకునే విధంగా తమ వద్ద ప్రత్యేక దుస్తులు అందుబాటులో ఉన్నాయని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ తెలిపారు. అంతే కాకుండా వర్షాకాలం సందర్భంగా అన్ని రకాల రెయిన్ కోట్‌లు అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉన్నాయన్నారు. భరించలేనంతగా ఉండే చలిని సైతం లెక్కచేయకుండా యాత్రికులు అమర్‌నాథ్‌కు వెళుతుంటారని..యాత్రికుల సౌకర్యార్థం పాతబస్తీ మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ ఆధ్వర్యంలో ఉలెన్, నైలాన్ దుస్తులను ప్రత్యేకంగా తయారు చేయించి అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు శనివారం మదీనా సర్కిల్‌లోని షో రూం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ మాట్లాడుతూ.. ఎముకలు కొరికే చలిని సైతం తట్టుకునే విధంగా ప్రత్యేక దుస్తులను తయారు చేయించామన్నారు. నిపుణుల పర్యవేక్షణలో ప్రత్యేకంగా రూపొందించి తమ షో రూంలో అందుబాటులో ఉంచామని ఆయన వెల్లడించారు.

సిటీ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్


లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న చీఫ్ జడ్జి రేణుకా యారా

యాకుత్‌పురా: జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం పురానీహవేలీలోని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టులో పలు కేసులను పరిష్కరించారు. కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుకా యారా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో నిజమైన కక్షిదారుల సమక్షంలో పెండింగ్‌లో ఉన్న 323 కేసులు, 3030 ప్రీ లిటిగేషన్ కేసులతో పాటు మొత్తం 3353 కేసులను పరిష్కారించి బాధితులకు రూ.26,02,84,866ల నష్ట పరిహారని నిర్ణహించినట్లు న్యాయ సేవాధికార సంస్థ అధికారులు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అదనపు చీఫ్ జడ్జిలు మురళీ మోహన్, డానీ రూత్, జడ్జిలు భవానీ, కంచన రెడ్డి, సిరి సౌజన్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్యుల బదిలీలు పారదర్శకంగా జరిగేలా చూడాలి


నినాదాలు చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ టీచింగ్ డాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టనున్న వైద్యుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ టీచింగ్ డాక్టర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా గల 33 జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యుల బృందం కోఠిలోని డీఎంఈ కార్యాలయ ప్రాంగణంలో సాధారణ బదిలీల ప్రక్రియలో వైద్య సంఘాలు, వైద్యుల సంఘం నేతల ప్రమేయం లేకుండా పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, ప్రతినిధులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బాబురావు, డాక్టర్ మనీష్, డాక్టర్ కవిత తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో తిష్టవేసిన వైద్యులకు స్థాన చలనం కల్పించడడంతో పాటు గత రెండేళ్లకు మించి ఒకే చోట గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు బదిలీల్లో అవకాశం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ఆరేళ్లుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న వైద్యుల సేవలను గుర్తించి, నగరంలోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తమ సమస్యలను ఇన్‌చార్జి డీఎంఈ డాక్టర్ వాణి, వైద్య ఆరోగ్య కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ అజామ్, డాక్టర్ జగతి, డాక్టర్ బెంజిమెన్, డాక్టర్ మూసాఖాన్, డాక్టర్ అమరావతి, డాక్టర్ కవిత, డాక్టర్ హేమలత, డాక్టర్ అరుణ, డాక్టర్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ


చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోల్కొండ: ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కమిటీ తీర్మానం చేసి వంద శాతం రిజర్వేషన్ అమలు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాసాబ్‌ట్యాంక్‌లో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో డీఎస్‌సీ–2024లో నోటిఫికేషన్ ప్రకటనలో ఆర్టికల్ 244 (1) అనుసరించి ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. ప్రభుత్వం మెగా డీఎస్‌సీ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో ఏజెన్సీ డీఎస్‌సీ, జనరల్ డీఎస్‌సీ రెండు రకాల నోటిఫికేషన్‌ను ప్రకటించాలన్నారు. షెడ్యూల్ ట్రైబల్స్‌కు న్యాయం చేకూర్చాలన్నదే తమ డిమాండ్ అని ఆయన అన్నారు. దీని కోసం తాము ఈ నెల 28న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్, కార్యదర్శి గోవింద్‌నాయక్, వడిత్య రమేష్‌నాయక్, సురేష్‌నాయక్ తదితరులున్నారు.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం

- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- క్షేత్రస్థాయి పరిశీలన విస్మరించి కార్యాలయాలకే పరిమితమవుతున్న వైనం
- ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ, విద్యుత్ విభాగాల మధ్య పొసగని వ్యవహారం


గాంధీనగర్‌లో పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించని జీహెచ్‌ఎంసీ సిబ్బంది


అస్మాన్‌ఘడ్ ఏడీఈ పరిధిలో నరికిన చెట్ల కొమ్మలను తొలగించని విద్యుత్ సిబ్బంది

చార్మినార్: అధికారుల మధ్య సమన్వయ లోపంతో పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నోసార్లు జీహెచ్‌ఎంసీ గ్రేటర్ కమిషనర్‌తో పాటు ఆయా జోనల్ కమిషనర్లు సైతం విద్యుత్, జలమండలి అధికారులతో కో ఆర్డినేషన్ సమావేశాలను నిర్వహించి దశ దిశలను నిర్దేశించిన సందర్భాలెన్నో ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్‌లోని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు మరీ ముఖ్యంగా అలెర్ట్ చేశారు. అయినా వారి విధి విధానాలలో ఎలాంటి మార్పు రావడం లేదు. అలాగే టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన దక్షిణ మండలం(పాతబస్తీ)లోని ఎస్‌ఈ సంబంధిత డీఈలతో పాటు ఏడీఈలకు చెప్పినా పెడ చెవిన పెడుతున్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన చేయాల్సిన ఈ రెండు విభాగాల అధికారులు తమ సీట్లకే పరిమితమవుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు..

అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వాటిని పట్టించుకోకుండా కింది స్థాయి అధికారికి చెప్పి పని చేయించుకోవాలి సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. పై అధికారే ఈ విధంగా నిర్లక్ష్యంగా జవాబిస్తే ఇంకెవరికి చెప్పుకోవాలి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలు ముఖ్యంగా పాతబస్తీలోని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్‌లోని ఇంజినీరింగ్ విభాగం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్–ఎస్‌డబ్ల్యూఎం)తో పాటు దక్షిణ మండలం టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన సీబీడీ ఇంజినీరింగ్ అధికారుల, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారుల మధ్య సమన్వయ లోపంతో పాత బస్తీ ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపులో నిర్లక్ష్యం..

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం పరిధిలోని సీబీడీ ఏడీఈ ఇంజినీరింగ్ అధికారులు చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నారు. చెట్ల కొమ్మలను అడ్డంగా నరుకుతున్న వారు వాటిని అడ్డగోలుగా రోడ్లపై పడేసి చేతులు దులుపుకుంటున్నారు. సకాలంలో వాటిని అక్కడి నుంచి తొలగించకపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల అస్మాన్‌ఘడ్ డీఈ పరిధిలోని గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో రెండు వారాల క్రితం సంబంధిత కాంట్రాక్టర్ చెట్ల కొమ్మలను తొలగించి చెత్తను ఎత్తకుండా చేతులు దులుపుకున్నారు.

చెత్త కుప్పలతో తప్పని తిప్పలు..

జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలో చెత్త కుప్పల తొలగింపు సమస్య రోజురోజుకూ జటిలమవుతోంది. రెండేళ్ల క్రితం ఆయా సర్కిల్ పరిధిలో ఏఎంహెచ్‌ఓల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య విభాగం పనులు జరిగేవి. చెత్త తొలగింపు వీరే చూసే వారు. పరిస్థితుల్లో మార్పులు తెచ్చి పారిశుద్ధ్య (చెత్త తొలగింపు) పనులను జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంటూ కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసి విధులను అప్పగించారు. దీంతో అక్కడక్కడ పనులు జరుగుతున్నా మేజర్ బస్తీలలో చెత్త అలాగే పేరుకుపోతున్నాయి. ఏదైనా సమస్య వచ్చి అధికారులను సంప్రదిస్తే రాంకీ సంస్థ వారు మాకు సహకరించడం లేదు.. మేమేం చేయ లేం అని చేతులెత్తేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగర్‌కాలనీ: శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐలోని వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఐటీఐలోని ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, కంప్యూటర్స్ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనర్, కటింగ్ అండ్ టైలరింగ్ ట్రేడ్లలో చేరాలనుకున్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చొన్నారు. ప్రభుత్వ నియమనిబంధనలు, రిజర్వేషన్ల ప్రకారం ప్రవేశాల ప్రక్రియ ఉంటుందని వివరించారు. వివరాలను విజయనగర్‌కాలనీలోని జిల్లా ఉపాధికల్పనా కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శాంతినగర్ ప్రభుత్వ ఐటీఐలో లేదా 94400 68152లో సంప్రదించవచ్చు.

రెండేళ్ల బాలుడితో సహా మతిస్థిమితం లేని బాలిక అదృశ్యం


రిషిక్, నిఖిత (ఫైల్)

గౌలిపురా: ఇంటి ముందు ఆడుకుంటున్న మతిస్థిమితం లేని బాలిక, రెండేళ్ల బాలుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..సుల్తాన్‌షాహీ గంగపుత్ర సంఘం ప్రాంతానికి చెందిన సి.గణేశ్, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. పెద్ద కుమారుడు రిషిక్ (2) స్థానికంగా ఉండే మతిస్థిమితం లేని మేనకోడలు నిఖిత (17)తో తరుచూ ఆడుకుంటూ ఉంటారు. కాగా ఈ నెల 7న సాయంత్రం 5.30 గంటలకు నిఖిత, రిషిక్ ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయారు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు, మేనకోడలు కనిపించడం లేదని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే కౌసర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం టోలిచౌకీ డివిజన్‌కు చెందిన వివిధ కాలనీల ప్రతినిధులు ఆయనను కలిశారు. తమ కాలనీలు ముంపునకు గురి కాకుండా బాక్స్ టైప్ డ్రైనేజీ ఏర్పాటు చేసినందుకు వారు ఎమ్మెల్యేను పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టోలిచౌకీ డివిజన్‌తో పాటు నియోజకవర్గంలో ఒక్క బస్తీ, కాలనీ గానీ ముంపునకు గురి కాకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. మొదటిసారిగా టోలిచౌకీ నిజాం కాలనీలో కోటి రూపాయలతో బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మించామని దీన్ని వల్ల నిజాం కాలనీకి వరద ముంపు శాశ్వతంగా తొలగిపోయిందన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తాను పరిష్కరించేందుకు సిద్ధం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ మజ్లిస్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.

మెహిదీపట్నంలో నేషనల్ మార్ట్ ప్రారంభం


నేషనల్ మార్ట్ సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: తక్కువ ధరలకు నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందించిన వారే మార్కెట్‌లో ప్రజల ఆదరణ పొందుతారని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం మెహిదీపట్నంలో ఆయన నేషనల్ మార్ట్ ఇండియా కా హైపర్ మార్ట్‌ను మార్ట్ వ్యవస్థాపకుడు యశ్ అగార్వల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ మార్కెట్‌లు యువ వ్యాపారవేత్తల ఆధ్వర్యంలో సరికొత్త అనుభూతులను ప్రజలకు అందిస్తున్నాయన్నారు. మెహిదీపట్నంలో ప్రారంభించిన తమ హైపర్ మార్ట్ 7వ దని రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని స్టోర్స్ ఏర్పాటు చేస్తామని ఇండియా మార్ట్ వ్యవస్థాపకులు యశ్ అగర్వాల్ అన్నారు.

ఎంపీ శశిథరూర్‌కు సన్మానం


ఎంపీ శశిథరూర్‌ను సన్మానించిన నిర్మల్‌కుమార్ యాదవ్

అబిడ్స్: ఎంపీ శశిథరూర్‌ను గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ బీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్ శనివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా విజయం సాధించిన శశిథరూర్‌ను ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్మల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ..తెలంగాణతో పాటు దేశ నలుమూలలా కాంగ్రెస్ పార్టీ అధిక శాతం విజయం సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

పీఈటీల సమస్యల పరిష్కారంపై హర్షం

గన్‌ఫౌండ్రీ: వ్యాయామ విద్య ఉపాధ్యాయులు గత కొన్ని సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పదోన్నతులకు మోక్షం కలగడంపై తెలంగాణ రాష్ట్ర వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్ మాట్లాడుతూ..2017, 19 నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న న్యాయపరమైన అడ్డంకులను తొలగిస్తూ విద్యాశాఖ పదోన్నతులు, బదిలీలలో పీఈటీలను సైతం చేర్చడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గతంలో అప్‌గ్రేడ్ చేసిన 1849 స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులను కూడా ఈ షెడ్యూల్‌లోనే చేర్చడంపై ఆనందంగా ఉందన్నారు. పీఈటీల సుదీర్ఘ సమస్యలను పరిష్కరించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలియజేశారు. సీఎం రేవంత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ డైరెక్టర్ దేవసేనలకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిపై రౌడీషీటర్ హత్యాయత్నం

అబిడ్స్: తన కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిపై రౌడీషటర్ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ వివరాల ప్రకారం... అప్పర్‌ధూల్‌పేట్‌కు చెందిన రౌడీషీటర్ మన్మోహన్ సింగ్ (50) రౌడీషీటర్. ఇటీవల అతని నివాసంపై పోలీసులు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శివలాల్‌నగర్ ప్రాంతానికి చెందిన సురేందర్ సింగ్ అలియాస్ సురు పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటాడనే అనుమానంతో అతనిపై కక్ష పెంచుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సురేందర్ సింగ్ రహీంపురా వైపు వెళ్తున్నట్లు తెలియడంతో అతనిపై గొడ్డలితో దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సురేందర్ సింగ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం



లంగర్‌హౌస్: అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆ పంచముఖ ఆంజనేయుని ప్రసాదాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో స్వీకరించాలని శ్రీరాంచంద్రజీ మఠం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా అన్నారు. శనివారం సంగం మఠంలో రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పంచముఖ ఆంజనేయునికి సింధూర లేపనం, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం ముందు రాంలీలా మైదానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌దాస్ బాబా మట్లాడుతూ..ప్రతి శనివారం, అమావాస్య రోజుల్లో ఆలయం ముందు 500 మందికి అన్నదానం నిర్వహిస్తున్నామని, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఎగ్జిబిషన్‌లో జోరుగా చేప ప్రసాదం పంపిణీ



మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం


ఎగ్జిబిషన్ అజాంత గేటు వద్ద పోలీసులు అత్యుత్సాహం చూపడంతో అవస్థలు పడిన ఆస్తమా రోగులు

చేప ప్రసాద పంపిణీ శనివారం రాత్రి వరకు కొనసాగింది. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఆస్తమా రోగులకు అల్పాహారాలు, తాగునీరు. వైద్య సేవలు ఉచితంగా అందించారు. మెడికొవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం ఉచిత వైద్య సేవలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం పంపిణీ చేశారు. – అబిడ్స్


చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న సిబ్బంది


చేపప్రసాద పంపిణీలో పాల్గొన్న మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్

బత్తిని నివాసం వద్ద ..

దూద్‌బౌలి: ఆస్తమా వ్యాధిగ్రస్తులకు వంశపార్యపరంగా బత్తిని కుటుంబ సభ్యులు పంపిణీ చేసే చేప ప్రసాదాన్ని దూద్‌బౌలిలోని నివాసంలో కుటుంబసభ్యులు రోగులకు శనివారం పంపిణీ చేశారు. మృగశిర కార్తె ప్రవేశించిన సందర్భంగా శనివారం ఉదయం బత్తిని కుటుంబ సభ్యులు చేప ప్రసాదాన్ని స్వీకరించిన అనంతరం ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు ఇంటి వద్ద సైతం చేప ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శనివారం ఉదయం నుంచే రోగులు ఇంటి వద్ద బారులు తీరారు. ప్రధానంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నప్పటికీ..ఆనవాయితీగా కొంతమంది నమ్మకంతో ఇంటి వద్దనే వేయించుకుంటారు. ఈ సందర్భంగా దూద్‌బౌలిలోని బత్తిని నివాసం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని కుటుంబ సభ్యులు గౌరీ శంకర్ గౌడ్, అనిరుద్ గౌడ్ కుటుంబ సభ్యులు చేప ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ముగిసినప్పటికీ..దూద్‌బౌలిలోని తమ ఇంటి వద్ద వచ్చిన రోగులందరికీ చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తామని బత్తిని వెల్లడించారు.


చేప ప్రసాదం తీసుకుంటున్న యువకుడు


దూద్‌బౌలిలో చేప ప్రసాదం కోసం క్యూ కట్టిన రోగులు